క్లుప్తంగా

నేడు పంచాయతీ పాలకవర్గ అత్యవసర సమావేశం

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలం ఎనికేపాడు పంచాయతీ కార్యాలయంలో గురువారం అత్యవసర సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ రాచమళ్ల పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ సందర్భంగా పూర్ణ మాట్లాడుతూ ఈనెల 25న బయట వ్యక్తులు దౌర్జన్యంగా పంచాయతీ కార్యాలయంలో చొచ్చుకు వచ్చి వీరంగం సృష్టించారన్నారు. బాణసంచా కాలుస్తూ సర్పంచ్ రూమ్‌లో కేక్ కట్ చేసి గోడలు, టేబుల్‌పై పులిమి వికృత చేష్టలకు పాల్పడ్డారన్నారు. ఇంతటితో ఆగకుండా సిబ్బందిని భయ భ్రాంతులకు గురి చేసి సర్పంచి రూమ్‌లో గోడలకు తగలించి ఉన్న మాజీ ముఖ్యమంత్రులు వైఎస్సార్, జగన్ చిత్రపటాలను ధ్వంసం చేసిన విషయం విధితమేనన్నారు. ఈ ఘటనకు పాల్పడ్డ వారిపై తగు చర్యలు తీసుకునే నిమిత్తం ఈ అత్యావసర సమావేశంలో పాలకవర్గ సభ్యులతో చర్చించి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

విద్యార్థి అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: కానూరులో విద్యార్థి అదృశ్యంపై పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు టీసీఆర్ కాలనీకి చెందిన లింగాల జోజి కానూరులో కార్పొరేట్ కాలేజీలో వంట పని చేస్తాడు. అతనికి భార్య ఇద్దరు పిల్లలు. అయితే అతని కుమారుడు (17) అదే కాలేజీలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. అతను తరచుగా ఫోన్‌లు చూడటంతో లింగాల జోజిని కాలేజీ యాజమాన్యం పిలిచి అతని కుమారుడిని కొద్ది రోజులు ఇంటి వద్ద ఉంచుకోమని తెలిపారు. దీంతో జోజి తన కుమారుడిని కాలేజీ బయటకు తీసుకు వచ్చి మందలించాడు. జోజి ఇంటికి బయలుదేరి వెళ్లగా కాలేజీ బయటకు వచ్చిన అతని కుమారుడు ఇంటికి రాలేదు. దీంతో కుమారుడి కోసం వెతకగా జాడ తెలియలేదు. ఈ ఘటనపై జోజి ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

డీ అడిక్షన్ సెంటర్లు వినియోగించుకోవాలి

ఓడీఐసీ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): మాదక ద్రవ్యాలు వినియోగించే వారు డీ అడిక్షన్ సెంటర్లను వినియోగించుకోవాలని ఓడీఐసీ కో ఆర్డినేటర్ అనిల్ కుమార్ అన్నారు. హనుమాన్‌పేటలోని ఏపీ డ్రగ్ యూజర్స్ ఫోరం ఆధ్వర్యంలో మాదక ద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫోరం ఆధ్వర్యంలో సపోర్ట్ డోంట్ ఫనిష్ అనే కమ్యూనిటీ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మత్తుకు బానిసైన వారు డీ అడిక్షన్ సెంటర్లను వినియోగించుకోవడం ద్వారా మత్తు నుంచి విముక్తి పొందవచ్చన్నారు. మత్తు నుంచి బటయ పడాలనే ధృఢ సంకల్పం ఉన్న వారు ట్రీట్‌మెంట్ తీసుకోవాలన్నారు. ఆంధ్రప్రదేశ్ డ్రగ్ యూజర్స్ ఫోరం ప్రెసిడెంట్ వి. నాగరాజు మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిస అయిన వారిని శిక్షించే విధంగా కాకుండా వారికి సరైన ట్రీట్‌మెంట్ అందజేయడం వల్ల వారిని ఈ మాదక ద్రవ్యాల నుంచి బయటపడేయవచ్చన్నారు. అలా కాకుండా వారిని శిక్షిస్తే కుటుంబ సభ్యులు, సమాజంలో వివక్షకు గురవుతారన్నారు. ప్రతి ఒక్కరూ ఈ మహమ్మారి నుంచి బయటకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా డ్రగ్ యూజర్స్ ఫోరం ప్రెసిడెంట్ ఎస్‌కే బాషా, ప్రగతి మిత్ర సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

రేపు మెగా వైద్య శిబిరం

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాజీవ్‌నగర్ కండ్రిక రోడ్డులోని మాస్టర్‌మైండ్స్ స్కూల్లో ఈ నెల 28న మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు వావిలాల రజనీకాంత్ శర్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిబిరంలో వన్‌టౌన్‌లోని అయాన్ ఐ ఆస్పత్రికి చెందిన డాక్టర్ బషీర్ అహ్మద్ బృందం కంటి సమస్యలైన శుక్లాలు, నీటి కాసులు, నల్లగుడ్డు , మైగ్రేన్, రెటీనా లోపాలకు ఏచితంగా పరీక్షలు నిర్వహిస్తారని తెలిపారు. అదే విధంగా సింగ్‌నగర్‌లోని ఫ్యామిలీ ఆస్పత్రికి చెందిన డాక్టర్ సైరా భాను పాల్గొని బీపీ, షుగర్, థైరాయిడ్, కిడ్నీలో రాళ్లు, అతిమూత్రం, రక్తహీనత, నిద్రలేమి వంటి సమస్యలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు ఇవ్వనున్నట్లు తెలిపారు. వీరితో పాటు, చిన్నపిల్లలు, మహిళల ఆరోగ్య సమస్యలకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారని, 26 రకాల రక్తపరీక్షలు ఉచితంగా చేయనున్నట్లు చెప్పారు.

అధిక లోడుతో ఆటో బోల్తా

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పైపుల కంపెనీ షిర్డీసాయిబాబా మందిరం సమీపంలోని వంతెన వద్ద అధిక లోడుతో వెళుతున్న ఆటో బోల్తా కొట్టింది. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో అధికలోడుతో ఆటో వంతెన కిందకు వచ్చేసరికి ఇరుక్కుంది. ఈ ఘటనలో ఆటో ముందు భాగం పైకి తేలిపోవటంతో ఆటో డ్రైవర్ కిందకు దూకేశాడు. నిత్యం రద్దీగా ఉండే ఈ మార్గంలో రోడ్డు మధ్యలో ఆటో ఇరుక్కుపోవటంతో కొంత సేపు రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అధిక లోడుతో ఆటోలు ప్రయాణిస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోకపోవటం పట్ల స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గుణదల పోలీస్‌స్టేషన్‌కు కూతవేటు దూరంలో ఈ ఘటన జరగటం గమనార్హం. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఓవర్‌లోడుతో వెళుతున్న వాహనదారులపై తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

చౌడు సమస్యకు పచ్చిరొట్టతో చెక్

- సేంద్రియ కర్బనం వృద్ధి
- భూమికి సమృద్ధిగా నత్రజని
- నేల గుల్లబారటంతో దిగుబడులు అధికం
- 50 శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ


ఈడుపుగల్లులో కళకళలాడుతున్న పచ్చిరొట్ట పైరు

కంకిపాడు: పచ్చిరొట్ట పైర్లు..నేలకు అవసరమైన జీవాన్ని అందిస్తాయి. భూ సారాన్ని పెంపొందించే అద్భుతమైన ఔషధాలు పచ్చిరొట్ట పంటలు. పోషకాలు భూమిలో సమృద్ధిగా వృద్ధి చెందటంతో ఆశించిన దిగుబడులు వస్తాయి. భూమిని కాపాడుకోవటం కోసం పచ్చిరొట్ట పైర్లను సాగుచేసుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యవసాయశాఖ 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలను రైతులకు అందించింది. రైతులు సబ్సిడీ విత్తనాలను సేకరించి పొలాల్లో చల్లారు.

ఇప్పటికే ఏపుగా..

పెనమలూరు నియోజకవర్గంలోని పెనమలూరు, కంకిపాడు, ఉయ్యూరు మండలాల్లో సుమారు 42 వేల ఎకరాల్లో సాగుకు అనువైన భూమి ఉంది. వేసవిలో వ్యవసాయశాఖ ద్వారా పంపిణీ జరిగిన పచ్చిరొట్ట విత్తనాలను కొనుగోలు చేసి పొలాల్లో చల్లుకున్నారు. తొలకరి వానలు, రుతుపవనాల ప్రభావంతో కురుస్తున్న వర్షాలతో పొలాల్లో చల్లిన పిల్లిపెసర, జీలుగ, జనుము తదితర పచ్చిరొట్ట పైర్లు ఏపుగా ఎదిగాయి. ఖరీఫ్ సాగు ఆరంభం నాటికి పచ్చిరొట్ట చేతికి వస్తుంది.

భూమిలో కలియదున్ని..

ఇప్పటికే నియోజకవర్గంలోని చాలా ప్రాంతాల్లో పిల్లి పెసర, జీలుగ పంటలు చేతికి రావటంతో పొలానికి నీరుపెట్టి పచ్చిరొట్ట పైరును భూమిలో కలియదున్ని కుళ్లబెడుతున్నారు. పంటను భూమిలో కుళ్లబెట్టి


కంకిపాడులో భూమిలో కలియదున్నటంతో కుళ్లుతున్న పచ్చిరొట్ట పంట

కలియదున్నటం ద్వారా భూమికి అదనపు ప్రయోజనం లభిస్తుంది. భూమి సారవంతం అవుతుంది. కుళ్లిన తరువాత పూర్తిస్థాయిలో దమ్ము చేయటం ద్వారా పచ్చిరొట్ట ద్వారా లభించే ప్రయోజనాలు భూమికి పూర్తి స్థాయిలో అందుతాయి.

చౌడు సమస్య నుంచి విముక్తి..

భూమి చౌడుబారితే చౌడు సమస్య నుంచి విముక్తి


దావులూరు వద్ద ఏపుగా ఎదిగిన పచ్చిరొట్ట పైరు

దొరుకుతుంది. అంతే కాకుండా భూమికి అవసరమైన సేంద్రియ కర్బనం వృద్ధి చెందుతుంది. నత్రజని అందుతుంది. సూక్ష్మపోషకాలు సమృద్ధిగా పంటకు అందుతాయి. నేల గుల్లబారుతుంది. పచ్చిరొట్ట పైరు సాగుతో తదుపరి పంట సాగులో అధిక దిగుబడులు, నాణ్యతాయుతంగా పొందేందుకు ఆస్కారం ఉంటుంది. దీంతో రైతులు పచ్చిరొట్ట సాగు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు.

సమాజాభివృద్ధిలో రోటరీ సేవలు అభినందనీయం

గన్నవరం: సమాజాభివృద్ధిలో రోటరీక్లబ్ కీలక పాత్ర వహిస్తుందని సీనియర్ రోటేరియన్ చింతపల్లి సీతారామయ్య పేర్కొన్నారు. మండలంలోని కేసరపల్లిలో బుధవారం రోటరీక్లబ్ ఆఫ్ గన్నవరం శాఖ అధ్యక్ష, కార్యదర్శులుగా పదవీ కాలం పూర్తిచేసుకున్న జాస్తి విజయ భూషణ్‌కుమార్, నర్రా సీతారామారావుకు వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాస్తి, నర్రాను రోటేరియన్లు ఘనంగా సత్కారించారు. అనంతరం చింతపల్లి మాట్లాడుతూ..గన్నవరం రోటరీక్లబ్ చరిత్రలోనే విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహించిన ఘనత విజయభూషణ్‌కుమార్‌కు దక్కుతుందన్నారు. పెద్ద ఎత్తున్న వైద్య శిబిరాలను నిర్వహించడంతో పాటు సంక్షేమ హాస్టల్స్‌లోని విద్యార్థులకు వసతుల కల్పనకు కృషి చేశారని చెప్పారు. పదో తరగతి విద్యార్థులకు పరీక్ష కిట్లు పంపిణీతో పాటు ఉత్తమ ఫలితాల సాధనకు కృషిచేసిన ఉపాధ్యాయులను సత్కరించడం అభినందనీయమన్నారు. రోటరీ సేవలను పేదలకు చేరువ చేయడంలో జాస్తి సఫలమయ్యారని మాజీ ఏఎంసీ చైర్మన్ పొట్లూరి


జేవీబీ.కుమార్, సీతారామారావును సత్కరిస్తున్న రోటేరియన్లు

బసవరావు పేర్కొన్నారు. అనంతరం రోటరీక్లబ్ నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా టీఎస్ఆర్‌కే ప్రసాద్, జీవీ రవిబాబును సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. చిన్న వయస్సులోనే సేవాభావాన్ని చాటుతున్న రావిపాటి సిరిలాస్య (ఎన్ఆర్ఐ)తో పాటు పలువురు రోటరీ సభ్యులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. రోటేరియన్లు గూడపాటి తులసీమోహన్, చిగురుపాటి కుమారస్వామి, కేఎస్. జగదీశ్వరరావు, కాసరనేని బాబురావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే



రామవరప్పాడు: విజయవాడ రూరల్ మండలం నున్న గ్రామంలోని 10 అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం గ్రాడ్యుయేషన్ డే ఘనంగా నిర్వహించారు. ఈ కేంద్రాల్లోని 22 మంది చిన్నారులు తమ ప్రీ స్కూల్ విద్యను పూర్తి చేసుకుని గ్రాడ్యుయేషన్ పొంది ప్రైమరీ స్కూల్‌కు వెళ్లేందుకు ప్రీస్కూల్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో నున్న సెక్టార్ సూపర్‌వైజర్ స్వర్ణకుమారి, అంగన్‌వాడీ కార్యకర్తలు కోటేశ్వరమ్మ, లలిత, విజయరాణి, సుధారాణి, శ్యామలారాణి తదితరులు పాల్గొన్నారు.

మారుతున్న సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవాలి



ఉంగుటూరు: కాలనుగుణంగా మారుతున్న శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానాన్ని ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటూ సరికొత్త ఆవిష్కరణలు రూపొందించే దిశగా విద్యార్థులు సిద్ధపడాలని ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ సీఈవో టి.అనిల్ కుమార్ అన్నారు. ఉంగుటూరు మండలం తేలప్రోలులోని ఉషారామ ఇంజినీరింగ్ కళాశాలలో ది ఇనిస్టిట్యూషన్ ఇన్నోవేషన్ కౌన్సిల్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ తరగతులు బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్నోవేషన్ సొసైటీలో ఆవిష్కరణలకు సంబంధించిన స్టార్టప్స్, ఎంటర్ ప్రెన్యూర్, ఇన్నోవేటర్స్, స్కిల్‌డెవలప్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. ఇన్నోవేషన్ సొసైటీలో సదుపాయాలు, అవకాశాలు సద్వినియోగించుకోవాలని కోరారు. ఈ శిక్షణా తరగతులకు రిసోర్స్ పర్సన్లుగా కృష్ణ సౌజన్య, ఏఆర్ చౌదరి వ్యవహరించారు. కళాశాల చైర్మన్ సుంకర రాంబ్రహ్మం, ప్రిన్సిపాల్ ప్రసాద్ పాల్గొన్నారు.

బ్యూటిఫికేషన్ పనుల పరిశీలన

పటమట (విజయవాడతూర్పు): నిత్యం రద్దీగా ఉండే బెంజిసర్కిల్ వద్ద బ్యూటిఫికేషన్ ఆకర్షణీయంగా ఉండాలని వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. బెంజిసర్కిల్ ఫ్లై ఓవర్ వద్ద నిర్వహిస్తున్న బ్యూటిఫికేషన్‌ను బుధవారం ఆయన పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగరంలోని ప్రధానమైన జంక్షనైన బెంజిసర్కిల్ వద్ద కాలుష్యాన్ని తగ్గించే దిశగా గ్రీనరీ పెంచాలని ఆదేశించారు. రోడ్లమీదకు వర్షపు నీరు రాకుండా ఎప్పటికప్పుడు సైడ్ డ్రైయిన్లలో పూడిక తొలగించాలని సూచించారు. గ్రీనరీ మెయింటినెన్స్ క్రాంట్రాక్టర్ సక్రమంగా పనిచేసేలా అధికారులు నిరంతరం పరిశీలన చేయాలని కోరారు. సిబ్బంది, కార్మికులు పనిలో అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ పర్యటనలో అడిషనల్ కమిషనర్ (ప్రాజెక్ట్)


బెంజిసర్కిల్ వద్ద గ్రీనరీని పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

కె.సత్యవతి, డెప్యూటీ కమిషనర్ (రెవెన్యూ) జి.సృజన, జోనల్ కమిషనర్–3 శివరామకృష్ణ, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (పార్క్స్) ఏఎస్ఎన్ ప్రసాద్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ –3 సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.

కుళాయిల్లో మురుగు నీరు

మధురానగర్(విజయవాడసెంట్రల్): 32వ డివిజన్ అయోధ్యనగర్, శాంతినగర్, రామలింగేశ్వర పేట, బసవతారకనగర్ తదితర ప్రాంతాల కుళాయిల్లో మురుగునీరు రావటంతో స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అసలే ఒక పక్క వర్షాలు, అనారోగ్య సమస్యలతో సతమతం అవుతున్న ప్రజలు కలుషిత తాగునీరు వల్ల ఎప్పుడు ఏ అనారోగ్యం సంభవిస్తుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై అధికారులకు ఎన్నిమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ పట్టించుకోవటం లేదని వాపోతున్నారు. కుళాయిల్లో మురుగు నీరు రావటంతో ఏం చేయాలో అర్థం కావటం లేదని మహిళలు విచారం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై కార్పొరేటర్ చన్నగిరి రామ్మోహన్‌రావు మాట్లాడుతూ కలుషిత తాగునీరు సరఫరా విషయమై ఇప్పటికే కమిషనర్‌కు వినతి పత్రం అందజేశామని చెప్పారు. 40 ఏళ్ల నాటి పాత పైపులైన్‌లు కావటంతో ఎక్కడ కలుషితం అవుతుందో అర్థం కావటం లేదని అధి


32వ డివిజన్‌లో మురికిగా వస్తున్న తాగునీరు

కారులు చెబుతున్నారని పేర్కొన్నారు. త్వరలోనే పాత పైపులను తొలగించి కొత్త పైపులైన్‌లు వేస్తామని అధికారులు హామీ ఇచ్చారన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, కాచి చల్లార్చిన నీటినే తాగాలని కోరారు.

నేడు డయల్ యువర్ డీఎమ్

భవానీపురం(విజయవాడపశ్చిమ): ఆటోనగర్ ఆర్టీసీ డిపోలో గురువారం ఉదయం 11 గంటల నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ డీఎమ్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కె.ప్రవీణ్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. డయల్ యువర్ డీఎమ్ ద్వారా 9959225463 మొబైల్ నంబర్‌కు ఫోన్ చేసి ఆటోనగర్ డిపో నుంచి దూర ప్రాంతాలకు వెళ్లే సర్వీసులు అయిన బెంగుళూరు, చెన్నై, విశాఖపట్నం, తిరుపతి, కర్నూలు, హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సంబంధించి ఏవైనా సలహాలు, సూచనలు తెలియ చేయవచ్చని వివరించారు.

ఏపీ హంస నగర కార్యవర్గం ఎన్నిక

లబ్బీపేట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (ఏపీ హంస) నగర నూతన కార్యవర్గాన్ని బుధవారం ఎన్నుకున్నారు. విజయవాడ ప్రభుత్వాస్పత్రిలో జరిగిన సమావేశంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్ సమక్షంలో ఎన్నికలు నిర్వహించారు. నగర కమిటీ నూతన అధ్యక్షుడిగా వి. రామకృష్ణ (మలేరియా విభాగం), అసోసియేట్ ప్రెసిడెంట్‌గా పి.శ్రీకాంత్ చౌదరి (పీపీ యూనిట్), ఉపాధ్యక్షులుగా కె.శ్రీదేవి, పి.జయకుమార్, విమల, వి.కృష్ణకిషోర్, వాసులను ఎన్నుకున్నారు. జనరల్ సెక్రటరీగా నాళం మురళీకృష్ణ (జీజీహెచ్), సహాయ కార్యదర్శులుగా ఎమ్ఎస్ఆర్‌కే ప్రసాద్, దీక్షితులు, భాస్కరరావు, సుభద్ర, బి.శ్రీనివాస రావును ఎంపిక చేశారు. ఆర్గనైజింగ్ సెక్రటరీగా లక్ష్మోజీ, ఉమెన్ వింగ్ సెక్రటరీగా సరోజిని, పబ్లి


ఏపీ హంస నగర నూతన కార్యవర్గ సభ్యులుగా ఎన్నికైన వారితో రాష్ట్ర అధ్యక్షుడు అరవ పాల్

సిటీ సెక్రటరీగా వి.జ్యోతిరాజు, కోశాధికారిగా షేక్ నూర్జహాన్‌లతో పాటు, మరో నలుగురు ఎగ్జిక్యూటివ్ సభ్యులుగా వ్యవహరించనున్నారు. కాగా ఎన్నికల అధికారిగా బి.కిరణ్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజాసేవలో భాగస్వాములు కావాలి



విజయవాడ కల్చరల్: సాంస్కృతిక సంస్థలు ప్రజా సేవలో భాగస్వాములు కావాలని సినీ పాటల పరిశోధకుడు బాలాజీకుమార్ తెలిపారు. ఇందిరా ఈవెంట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో తెలుగు, హిందీ, చిత్ర గీతాలు, గాయనీ గాయకులకు ఆత్మీయ సత్కార కార్యక్రమం నిర్వహించారు. బాలాజీ కుమార్ మాట్లాడుతూ గాయనీ గాయకులు సాంస్కృతిక వారథులని చెప్పారు. వారి సేవలను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. విద్యావేత్త సీతాదేవి మాట్లాడుతూ కళాకారులకు అవార్డులు ప్రోత్సాహం ఇస్తాయన్నారు. గాయనీ గాయకులు నిరంతరం సాధన చేయాలని సూచించారు. విజయశ్రీ గుప్తా, సువర్ణలక్ష్మి, సుధారాణి, గాయత్రి ,రహీమా,దుర్గ, వేణు, శ్రావణి తదితరులు తెలుగు, హిందీ చిత్ర గీతాలను ఆలపించారు. నిర్వాహకులు గాయనీ గాయకులను ఆత్మీయంగా సత్కరించారు.

మాదక ద్రవ్యాల నిర్మూలనకు ఐక్యంగా పనిచేయండి

- గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసుబాబు
- ఘనంగా అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నిర్మూలన దినోత్సవం

గన్నవరం: మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు విద్యార్థులు దూరంగా ఉండాలని గన్నవరం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి డాక్టర్ సీహెచ్. శ్రీనివాసుబాబు సూచించారు. స్థానిక జెడ్పీ బాలుర హైస్కూల్‌లో బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీనివాసుబాబు మాట్లాడుతూ.. సమాజంలో కొంత మంది యువత మాదకద్రవ్యాలకు బానిసై భవిష్యత్‌ను నాశనం చేసుకుంటున్నారని తెలిపారు. వీటి వినియోగం వల్ల ఆర్థికంగా, మానసికంగా, ఆరోగ్య పరంగా దెబ్బతింటారని చెప్పారు. యువత జీవితాలను సర్వనాశనం చేస్తున్న మత్తు, మాదకద్రవ్యాల నిర్మూలనకు అందరూ కలిసికట్టుగా పనిచేయాలని కోరారు. ఇటువంటి చెడు అలవాట్ల బారినపడకుండా విద్యార్థులు క్రమశిక్షణ, పట్టుదలతో చదువుకుని ఉన్నతులుగా ఎదగాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల గౌరవాన్ని పెంచే విధంగా నడుచుకోవాలని సూచించారు. ఎస్ఐ శివప్రసాద్, ఎంఈవో–1 కొండా రవికుమార్, ఎంఈవీ–2 కమల, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జీఎస్ఆర్.మూర్తి, కార్యదర్శి ఆర్.ప్రకాశరావు, సీనియర్ న్యాయవాది స్వామి, ఇన్‌చార్జి హెచ్ఎం మౌనిక కృష్ణకుమారి, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెనమలూరు: యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి సుంకర రాము అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా కానూరు వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీ, నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో బుధవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నెహ్రూ యువ కేంద్రం జిల్లా అధికారి రాము


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శ్రీనివాసుబాబు


హాజరైన విద్యార్థులు

మాట్లాడుతూ మాదక ద్రవ్యాలకు అలవాటుపడటం వలన యువత భవిష్యత్తు అంధకారంగా మారుతుందన్నారు. మాదక ద్రవ్యాలకు యువత అలవాటుపడితే జీవితం సర్వనాశనం అవుతుందన్నారు. కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ కొల్లా నరేంద్ర మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగం చాలా తీవ్రమైనదని, మద్యపానం, ధూమపానం మానవ జీవితాలపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటుపడిన వారు ఆర్థిక అవసరాల కోసం నేరాలకు పాల్పడతారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు కానూరులో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

గన్నవరం రూరల్: మాదక ద్రవ్యాలకు అందరూ వ్యతిరేకంగా ఉద్యమించాలని పురుషోత్తపట్నం శాఖా గ్రంథాలయం లైబ్రేరియన్ కె.కృపానందం చెప్పారు. బుధవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం పురస్కరించుకుని స్థానిక గ్రంథాలయం ఆవరణలో విద్యార్థులు, పాఠకులు, గ్రామపెద్దలు ప్రతిజ్ఞ చేశారు. మత్తు పదార్థాలకు సమాజం దూరంగా ఉండే విధంగా తమవంతు పాత్ర పోషిస్తావ ఈ సందర్భంగా వారు ప్రమాణం చేశారు.

ఊపందుకున్న దుక్కులు


పునాదిపాడులో ట్రాక్టరుతో దుక్కి దున్నుతున్న దృశ్యం

కంకిపాడు: ఖరీఫ్ సాగు పనుల్లో రైతులు నిమగ్నమవుతున్నారు. ఓ వైపు ఖరీఫ్ సాగుకు అవసరమైన వరి నారుమడులను సిద్ధం చేసుకుంటున్నారు. మరో వైపు వరి నాట్లకు వీలుగా పొలాలను దుక్కి దున్ని, దమ్ము చేసేందుకు రెడీ చేసుకుంటున్నారు. పెనమలూరు నియోజకవర్గం వ్యాప్తంగా రైతులు ఖరీఫ్ సాగు పనుల్లో బిజీగా ఉన్నారు.

ముగిసిన సినీ సంగీత వారోత్సవాలు

విజయవాడ కల్చరల్: నగరానికి చెందిన సాంస్కృతిక సంస్థల నిర్వహణలో గాంధీనగర్‌లోని కొత్తా పూర్ణానందం కళావేదికమీద నిర్వహిస్తున్న సినీ సంగీత వారోత్సవాలు బుధవారం ముగిసాయి. చివరి రోజు కార్యక్రమంలో తెలుగు కళావాహిని, శ్రీ కళా భారతి, పోలవరపు కోటేశ్వరరావు సాహితీపీఠం, పద్మశ్రీ ఘంటసాల కళాపరిషత్ ఆధ్వర్యంలో సినీ సంగీత విభావరి నిర్వహించారు. ఒంగోలుకు చెందిన గాయనీ గాయకులు తులసి, యూ కోటేశ్వరరావు, టి.నారాయణ, యస్.బాబు, శేషగిరి, ముప్పా నాగేశ్వరరావు, మస్తాన్‌వలి ఘంటసాల వెంకటేశ్వరరావు, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం గానం చేసిన గీతాలను ఆలపించారు. తెలుగు కళావాహిని అధ్యక్షుడు చింతకాయల చిట్టిబాబు,


ఘంటసాల చిత్ర గీతాలను గానం చేస్తున్న గాయనీ గాయకులు, వేదికపై చిట్టిబాబు

విశ్రాంత పోలీస్ అధికారి కె.డేవిడ్‌రాజు పాల్గొన్నారు. గాయనీ గాయకులను నిర్వాహకులు ఆత్మీయంగా సత్కరించారు.

స్థాయీ సంఘ సమావేశంలో 9 అంశాలకు ఆమోదం

పటమట(విజయవాడతూర్పు): స్థాయీ సంఘం సమావేశం మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆధ్వర్యలో బుధవారం నిర్వహించారు. వీఎంసీ ప్రధాన కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ రూంలో సమావేశం ఏర్పాటుచేశారు. ఎజండాలో మొత్తం 11 అంశాలు రాగా అందులో 9 అంశాలను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు. ఒక అంశాన్ని రికార్డు చేయగా, మరోక అంశాన్ని డ్రు వీకరించారు. వీఎంసీ టౌన్‌ప్లానింగ్ విభాగంలో భవన నిర్మాణాలకు ఆన్‌లైన్ అనుమతులు అందించేందుకు వీఎంసీ సిబ్బందితోపాటు ముగ్గురిని పూణేకు చెందిన సాఫ్టెక్ ఇంజినీర్స్ లిమిటెడ్ నుంచి సిబ్బందిని నియమించుకోగా వారికి ఏడాది పాటు చెల్లించాల్సిన వేతనాలు రూ. 17.83 లక్షలు బిల్లుపై వచ్చిన ప్రతిపాదనను సభ్యులు ఆమోదిస్తూ తీర్మానం చేశారు.

సర్కిల్–1 పరిధిలోని 43వ డివిజన్‌లో ఏకలవ్య నగర్‌లో సిమెంట్‌రోడ్డు, కల్వర్టు నిర్మించేందుకు అవసరమయ్యే రూ. 30.36 లక్షలు, అదే డివిజన్‌లో హెచ్ఆర్‌టీ అపార్టు వెనక క్రాస్‌రోడ్డు నిర్మాణానికి


స్థాయీ సంఘం సమావేశం నిర్వహిస్తున్న మేయర్ రాయన భాగ్యలక్ష్మి

అయ్యే రూ. 29.94 లక్షలు వీఎంసీ సాధరణ బడ్జెట్ నుంచి నిధులు కేటాయించాలని వచ్చిన ప్రతిపాదనపై సభ్యులు ఆమోదం తెలుపుతూ తీర్మానం చేశారు. వివిధ ప్రాంతాల్లో ఉన్న జిమ్‌లు, స్టేడియాలు, స్విమ్మింగ్‌పూల్, యోగా సెంటర్లలో కోచ్‌లుగా వ్యవహరిస్తున్న 21 మందికి ఒక్కొక్కరికీ నెలకు రూ. 18 వేల చొప్పున ఏడాదికి అయ్యే రూ. 38.16 లక్షలు వేతనాలు వీఎంసీ సాధారణ నిధుల నుంచి చెల్లించాలని వచ్చిన ప్రతిపాదనకు సభ్యులు ఆమోదం తెలిపారు.